క్లుప్తంగా

సంక్రాంతి ప్రతి కుటుంబంలో వెలుగు తేవాలి


నిస్సార్‌అహ్మద్

మదనపల్లె: సంక్రాంతి పర్వదినం ప్రతి కుటుంబంలోనూ వెలుగులు తేవాలని మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన సంక్రాంతి పండుగను ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు. పాడిపంటలతో ప్రతి ఇళ్లు వర్ధిల్లాలన్నారు. ప్రజలందరి జీవితాల్లో సంక్రాంతి వెలుగులు, సిరులు నిండాలన్నారు.

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



మదనపల్లె సిటీ: స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పుష్యమాస పూర్ణిమ ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకున స్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడి నియామకం

తంబళ్లపల్లె: బీజేపీ మండల అధ్యక్షుడిగా రేణుమాకుపల్లె పంచాయతీ దండువారిపల్లెకు చెందిన టి.వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ అధ్యక్షతన నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలను వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మదనమోహన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నందిరెడ్డి, మగ్గాల లక్ష్మయ్య,సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

మదనపల్లె సిటీ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.20లక్షల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఆయన పట్టణంలోని చంద్ర, తులశమ్మ, నసీజ్ జాన్, నరసింహులునాయుడు, జబ్బార్,గోవిందయ్య, లలితకు చెక్కులు అందజేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కమ్మచెరువు పంచాయతీ గారచెట్లపల్లి సమీప పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఐ రవికుమార్ సిబ్బందితో వెళ్ళి సోమవారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద లభించిన రూ.10,710ల నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నియామకం

బి.కొత్తకోట: ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బి.కొత్తకోటకు చెందిన కే.రవీంద్ర నియమితులయ్యారు. సోమవారం ఆ సంఘం అధ్యక్షులు ఎస్.మోహన్‌కుమార్ దర్మ నియామక ఉత్తర్వును ఆయనకు అందించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ఎరుకల హక్కులకు భంగం కలిగించినా, హక్కులను హరించినా పోరాటం చేస్తామని అన్నారు.

పూర్వ విద్యార్థులు బీరువా వితరణ


బీరువాను అందించిన పూర్వపు విద్యార్థులు

మదనపల్లె సిటీ: స్థానిక మాయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలకు 1996–97 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు బీరువాను వితరణగా ఇచ్చారు. సోమవారం పాఠశాలలో పూర్వ విద్యార్థులు హరిబాబు, ఆనంద, రమేష్, శ్రీనివాసులునాయుడు తదితరులు రూ.15 వేలు విలువ చేసే బీరునా పాఠశాల హెచ్‌ఎం పురం వెంకటరమణకు బీరువా బీగాలు అందించారు. పూర్వపు విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మల్లయ్యకొండపై ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: స్థానిక మల్లయ్యకొండపై సోమవారం భోగిపండుగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు భక్తులు మల్లయ్యకొండ, ఇనుముకొండ, సాధుకొండ సమూహాన్ని గిరి ప్రదక్షిణ చేసి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

ఊరూరా భోగి మంటలు


మదనపల్లె: ప్రసన్నవెంటకరమణస్వామి ఆలయం వద్ద భోగిమంటలు


పీలేరు: ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భోగి మంటలు

- ఆకట్టుకున్న ముత్యాల ముగ్గులు
- సంక్రాంతి లక్ష్మికి స్వాగతం

మదనపల్లె సిటీ: సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం భోగి సంబరాలు అంబరాన్నంటాయి. తెల్లవారుజాము నుంచే ఇళ్ల ఎదుట అందమైన ముగ్గులు వేశారు. రంగవళ్లలను తీర్చిదిద్ది గొబ్బెమ్మలను పెట్టి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా తెల్లవారుజామునే అందరూ లేచి ఇళ్ల ముందు సంప్రదాయబద్ధంగా భోగిమంటలు వేశారు. పాత చీపుర్లు, తట్టలు, విరిగిపోయిన బల్లలు తదితర పాత వస్తువులను మంటల్లో వేసి శరీరాన్ని వెచ్చబరుచుకున్నారు. చెడు కర్మలు తొలగించి పుణ్యగతులు సిద్ధింపజేయాలని అగ్నిదేవుని వేడుకున్నారు. మదనపల్లె పట్టణంలోని సొసైటీకాలనీ, ఎస్‌బిఐ కాలనీ, ప్రశాంత్‌నగర్, నెహ్రూనగర్, ఏపీ నాయుడు కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నిమ్మనపల్లెక్రాస్, గొల్లిపల్లి, నీరుగట్టువారిపల్లె, కమ్మవీధిలతో పాటు పలు కాలనీల్లో ప్రజలు ఇళ్ల ముందు భోగిమంటలు వేశారు. కాలనీల్లో యువకులు, అసోసియేషన్లు కలిసి భోగి మంటలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముత్తయిదువలు చిన్నారులపై భోగిపండ్లు (రేగిపండ్లు, బంతి పూలు, చామంతి, గులాబీ, రూపాయి నాణేలు) వేయించి ఆశీర్వదించారు. స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన్‌భట్టార్ ఆధ్వర్యంలో భోగిమంటలు వేసి పూజలు చేశారు.

పీలేరులో..

పీలేరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలో భోగి పండుగ ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారిజామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. సమాజంలో చీకటి తొలగిపోయి వెలుగులు నింపాలని కోరుకున్నారు. స్థానిక ఎస్వీ డీలక్స్ రోడ్డులో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో, నెహ్రూ బజార్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ముందు ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, వాసవిక్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. మహిళలు చేసిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

భోగ భాగ్యాలకు ప్రతీక

కేవీపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో భోగ భాగ్యాలకు ప్రతీకగా భోగి మంటలు వేశారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారిజాము నుంచే భోగిమంటలు వేశారు. ప్రతి కుటుంబంలో సమస్యలనే చీకటి తొలగి, సుఖ, సంతోషాలనే వెలుగు నింపాలని కోరుకున్నారు. పలు గ్రామాల్లో గ్రామస్తులంతా ఒక చోట చేరి సామూహిక భోగి మంటలు వేశారు. భోగి మంటల్లో నీళ్ల కాంచుకుని స్నానాలు ఆచరించారు. భోగిమంటల్లో ప్రసాదం వండుకుని అందరికీ పంచిపెట్టారు. పిండి వంటలు చేసుకుని బంధువులతో, మిత్రులతో కలసి సంబరాలు చేసుకున్నారు.

శివాలయంలో భోగి, పౌర్ణమి పూజలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయంలో సోమవారం సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో భోగి, పౌర్ణమి, ఆరుద్ర నక్షత్ర పూజలను కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఖన్నాస్వామి, మణికంఠ శర్మ మాట్లాడుతూ 110 ఏళ్ళకు ఒకసారి వచ్చే ఇలాంటి శక్తివంతమైన రోజు కోసం కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తుంటారన్నారు. గతంలో చేసిన పాపాల విముక్తి కోసం చేసే పూజలు, హోమాలు, అభిషేకాలు ఎంతో విశేషవంతమైనవన్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

భోగి మంటల్లో భూ బకాసురుల బొమ్మలు

బి.కొత్తకోట: నగర పంచాయతీ ఆస్తులు కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటి వరకు భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోలేదని నిరసన వ్యక్తం చేస్తూ సీపీఐ కార్యకర్తలు బి.కొత్తకోటలో సోమవారం భోగి మంటల్లో భూ బకాసురుల బొమ్మను మంటల్లో వేసి నిరసన తెలిపారు. భూములను రక్షిస్తామని, బాధితులకు న్యాయం చేస్తామని కూటమి నేతలు చెప్పినమాటలు ఏమయ్యాయని నాయకులు ప్రశ్నించారు. సత్వరమే భూ బకాసురులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపిఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, అఫ్రషల్లీ, రఘునాథ్, తంబయ్యశెట్టి, శంకర, గంగులప్ప, రియాజ్, హబీబ్, గణేష్ పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో భోగి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే ఇళ్ల ముందర భోగి మంటలు వేసుకొన్నారు. ఇళ్లలోని పాత వస్తువులతో పాటు మరిన్ని రకాల కట్టెలను తీసుకొచ్చి పెద్ద ఎత్తున మంటలు వేశారు. ఇళ్లకు ఉండే దిష్టిపోవాలంటూ దేవుడ్ని కొలిచారు.




పెద్దతిప్పసముద్రంలో పూజలు చేస్తున్న అర్చకులు, బి.కొత్తకోట: బొమ్మలతో భోగి మంటల వద్ద కార్యకర్తలు, ఆకట్టుకుంటున్న సంక్రాంతి ముగ్గు

విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి

–భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం


విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో వేస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె సిటీ: పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, లేకపోతే భోగిమంటల్లో బిల్లులు కాలిపోయినట్లు కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహంలో కొట్టుకుపోకతప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మదనపల్లె పట్టణంలో అడ్డగోలుగా వివిధ రకాల విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. ట్రూఅప్ చార్జీలు, పెంచిన కరెంటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.స్మార్ట్‌మీటర్లు పెట్టొదని అదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ట్రూప్ అప్‌చార్జీలను 2022, 23, 24 సంవత్సరాలకు సంబంధించి అదనపు భారాన్ని బిల్లులకు జమ చేయడం సరికాదని మండిపడ్డారు. దీంతో సామాన్యుడు బిల్లులు కట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్‌చార్జీలు పెంచబోమన్న సీఎం చంద్రబాబు నేడు చేస్తున్న పని ఏంటని ప్రశ్నించారు. అదే విధంగా అదానితో ఒప్పందం పెట్టుకుని ఒకవైపున రైతులకు వివిధ వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తుండటం పట్టబట్టారు. విద్యుత్ భారాలతో రైతులపై మరింత భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి, సీపీఎం నాయకులు నాగరాజు, ప్రభాకర్, మల్లికార్జున, రమణ, వెంకటేష్, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..గోదాదేవి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

మదనపల్లె సిటీ: స్థానిక బర్మావీధిలోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో భోగి పండుగను పురస్కరించుకుని సోమవారం శ్రీ గోదాదేవి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు రాజేష్‌స్వామి, వేదపండితులు నరసింహాచార్యులు శాస్త్రోక్తంగా శ్రీ మహా విష్ణువు అంశ అయిన శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ మహాలక్ష్మి అంశ అయిన గోదాదేవిక కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరాములునాయుడు , కమిటీ సభ్యులు నాగార్జున బాబు, బాబునాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మొదట రక్షా సూత్రధారణ, కణ్యావరుణ విశేషార్చన కార్యక్రమాలు జరిపారు. అనంతరం వైభవోతపేతంగా మాంగల్య ధారణ కార్యక్రమాన్ని చూసిన భక్తులు ఆనందపరవశులయ్యారు. వేద పండితులు గోదా కళ్యాణ ప్రాశస్త్యం గురించి భక్తులకు వివరించారు. చివరగా మాలికా పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధనుర్మాసం మొదలు నుంచి శ్రీ త్రిదండి చిన్నజియ్యార్‌స్వామి శిష్యులు శాంతారామ్‌స్వామి ప్రతి రోజు పాశురాలు పఠించారు. తెల్లవారుజామున ధనుర్మాస ప్రాతఃకాల పూజను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోదాదేవి వేషధారణ ఆకట్టుకుంది.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): అధికారం కోసం ఎన్నికల సమయంలో ఇబ్బడి ముబ్బడిగా అలివికాని హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. సోమవారం వాల్మీకిపురం పంచాయతీ పరిధిలోని ఓబులంపల్లిలో స్థానిక నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ వైస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా ప్రజలకే చేరుతుండేదని, ప్రస్తుతం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని ఎద్దేవా చేశారు. పండుగ నెలలోనూ ఉద్యోగస్తులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెట్టడం చూస్తున్నామన్నారు. సామాజిక, దివ్యాంగ పింఛన్ల లబ్ధిదారులను తగ్గించడమే లక్ష్యంగా ఏరివేత మొదలు పెట్టిన ప్రభుత్వం ప్రతి నెలా పింఛనుదారుల సంఖ్య తగ్గిస్తోందన్నారు. అధికారం చేపట్టిన సుమారుడు ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క కొత్త పింఛను ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేకవిధానాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడికి పరామర్శ

ఓబులంపల్లికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారెం రాం నారాయణ రెడ్డి ఇటీవల మోకాలు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల సోమవారం మాజీ జెడ్పీటీసీ సభ్యుని ఇంటికి చేరుకుని ఆయనను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ళ భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ నారెం కాంతమ్మ, న్యాయవాది అశోక్‌రెడ్డి, కూరపర్తి రవీంద్రారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, పెద్దబాబు, రాజన్న, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పీలేరు రూరల్ : మండలంలోని తలపులలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నాయకులు కోటపల్లె బాబురెడ్డి, స్పోర్ట్స్ మల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. నిర్వాహకులు మురళీమోహన్‌రెడ్డి, బాల మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 14 టీములు పాల్గొంటున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ. 10 వేల తోపాటు భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపపారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, సందీప్‌రెడ్డి, మదనమోహన్‌నాయుడు, రామచంద్ర, నాగిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కుల వ్యవస్థే దేశానికి ప్రధాన శత్రువు

మదనపల్లె సిటీ: కుల వ్యవస్థ భారతదేశానికి ప్రధాన శత్రువని, ఆ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే గుర్తించి కుల నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. బాస్ 13వ వార్షికోత్సవాల్లో భాగంగా మదనపల్లెలో నిర్వహించిన కుల దహనం సభ తీర్మానాలను బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధి దుర్గం సుబ్బారావుతో కలిసి సోమవారం వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు , స్థానిక ప్రభుత్వాలు సమైక్య కార్యాచరణతో కుల నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. కుల వివక్ష, వేధింపుల నిర్మూలనకు ఉద్దేశించిన చట్టాలను కఠినంగా అమలు చేయాలి. గ్రామాల్లో ఎస్సీ,ఎస్టీలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చేది భూమి. భూమి లేని ప్రతి ఎస్సీ,ఎస్టీ కుటుంబానికి ఐదెకరాల భూమిని పంపిణీ చేయాలి. కుల నిర్మూలన ప్రచారానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ,స్థానిక ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. కులాంతర వివాహాలకు రూ.25లు ప్రోత్సాహం అందించాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ తదితర కార్పొరేషన్లకు జనాభా దామాషా ప్రకారం నిధులు విడుదల చేయాలన్నారు. సమావేశంలో ముత్యాల మోహన్, పీర్‌బాషా, చాట్ల బయన్న, రవిశంకర్, రెడ్డిప్రసాద్, కృష్ణ, గంగాధర్, చిన్నా, మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మకర జ్యోతి వేడుకలకు వేళాయె..!

- నేడు అయ్యప్పస్వామి ఆలయంలో తిరునాల
- మకరజ్యోతి తరహాలో ప్రత్యేకంగా నిర్వహణ
- 15 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి


అయ్యప్పస్వామి ఆలయం

మదనపల్లె సిటీ: శబరిమలలో మకర సంక్రాంతి నాడు అయ్యప్పస్వాములకు మకరజ్యోతి కనువిందు చేస్తూ దివ్యానుభూతిని కలిగిస్తుంది. అదే తరహాలో మదనపల్లె పట్టణం అయ్యప్పనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర జ్యోతి వేడుకకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 15 ఏళ్లుగా అనవాయితీగా కొనసాగిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

నిత్యపూజలతో అలరారుతూ...

భక్తులకు ఆరాధ్యదైవ, కలియుగంలో పాపాలను తొలగించే ఆనందధామంగా అందరిని రక్షిస్తున్న దైవం అయ్యప్పస్వామి డివిజన్ కేంద్రమైన మదనపల్లె పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయం వెలసింది. ఇక్కడ నిత్యం పూజలు, ఉత్సవాలు,భక్తులతో వైకుంఠధామంగా అలరారుతోంది. ఇతర ప్రాంత పర్యాటకులను సైతం ఆకర్షించేలా ఆలయ నిర్మాణం జరిగింది. ఇక్కడ ప్రతి ఏడాది అయ్యప్పస్వామి ఉత్సవాలను క్రమం తప్పకుండా కేరళ రాష్ట్రంలోని శబరిమల లో జరిగిన పద్ధతిలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మకర సంక్రాంతి రోజున శబరిమలలో మకరజ్యోతి దర్శనం ప్రత్యేకంగా కాగా మదనపల్లె అయ్యప్పస్వామి ఆలయంలో కూడా కర్పూర జ్యోతి దర్శనం ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

విశేష పూజలు

సంక్రాంతి నాడు ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, అష్టాభిషేకం జరుగుతుంది. స్వామి తిరువాభరణాలు పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. అయ్యప్పమాలాధారులకు పద్దెనిమిది మెట్ల ద్వారా ఇరుముడుల చెల్లింపులు జరుగుతాయి. సాయంత్రం మకర జ్యోతిదర్శనం నిర్వహించారు. అనంతరం బంగారు ఆభరణాలతో భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. ఇందుకు ఆలయాన్ని రంగు విద్యుత్‌దీపాలు, పూలతో అలకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నసంతర్పణ చేయనున్నారు.